నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | సెప్టెంబర్ 20, 2024 | www.navatelangana.com

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

- వేడినీళ్ల కోసం హీటర్ పెడుతుండగా ఘటన


మృతి చెందిన రౌతు సాయిలు

నవతెలంగాణ-నిజాంసాగర్

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. నిజాంసాగర్ ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రౌతు సాయిలు (53) అనే వ్యక్తి ఉదయం హైదరాబాద్ వెళ్లేందుకు గానూ రెడీ అయ్యేందుకు స్నానానికి వేడి నీళ్లను వాటర్ హీటర్‌తో పెడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాన్సువాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడు సాయిలుకు భార్య, పిల్లలు ఉన్నారు. కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిస్ట్రిబ్యూటర్ కాల్వలో మహిళ మృతదేహం లభ్యం

నవతెలంగాణ-నిజాంసాగర్

మహమ్మద్‌నగర్ మండలంలోని మగ్గంపూర్ గ్రామ శివారులోని నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్ కాలువలో మహిళా మృతదేహం లభ్యమైంది.

కాలువలో మృతదేహం ఉన్నట్టు గ్రామస్తులు గుర్తించి పోలీస్‌లకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి నిజాంసాగర్ ఎస్సై సుధాకర్ చేరుకుని పరిశీలించారు. డిస్ట్రిబ్యూటర్ ఏడవ కెనాల్ వద్ద గుర్తుతెలియని మహిళా శవం లభ్యమవ్వగా.. ఆమె వయసు (50 నుంచి 55) మధ్యలో ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలిపై నీలిరంగు చీర, పసుపు రంగు జాకెట్ ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ మహిళ తెలిసిన వారు 8712686172, 8712686170 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.


మృతి చెందిన మహిళ


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఇంటింటి సర్వేను
నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలి

- పరిశీలకులు అబ్దుల్ హమీద్ సూచన
- కలెక్టర్‌తో కలిసి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా ఓటరు జాబితా సవరణ కోసం కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం నుంచి పరిశీలకులుగా విచ్చేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి గురువారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, నియోజకవర్గ కేంద్రాల తహశీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కొనసాగుతున్న ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ, ఇంటింటి సర్వే, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ ఏర్పాట్లు, స్వీప్ కార్యకలాపాలు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, దాఖలైన దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలలో నియోజకవర్గాల వారీగా ప్రగతిని సమీక్షిస్తూ, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 26 నాటితో గడువు ముగియనున్న దృష్ట్యా ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని, 100 శాతం సర్వే పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని అన్నారు. ఇప్పటికే సర్వే పూర్తి చేసిన బీఎల్ఓలను అవసరం ఉన్న చోట ఇతర పోలింగ్ కేంద్రాలలో సర్వే కోసం సర్దుబాటు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి లో ప్రతి ఇంటికి తిరుగుతూ జాబితాను సరిచేయాలని, మరణించిన వారి పేర్లు తొలగించాలని, పేర్లు, చిరునామాలు వంటివి ఏవైనా మార్పులు ఉంటే, పక్కాగా నిర్ధారణ చేసుకుని బీఎల్ఓ యాప్ ద్వారా మార్చాలని సూచించారు. ఆన్లైన్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన జరిపి, ఐ.టీ టూల్స్ ద్వారా సరి చేయాలన్నారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసే సమయానికే ఓటరు సవరణ జాబితా సమగ్రంగా రూపొందించబడితే, తదుపరి అభ్యంతరాలకు అంతగా ఆస్కారం ఉండదని అన్నారు. ప్రతి ఓటరుకు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు హక్కు ఉంది అనే వివరాలు తప్పనిసరిగా తెలిసేలా బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లచే అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ఓటర్లలో చైతన్యం పెంపొందించేందుకు స్వీప్ ఆక్టివిటీస్ ద్వారా విద్యా సంస్థలు, సామాజిక మాధ్యమాలు, బస్టాండులు తదితర రద్దీ ప్రదేశాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వేకు వెళ్లిన సమయంలో ఎస్-ఎస్ఆర్-2025 అని మార్కింగ్ చేయించాలన్నారు. 15 వందలు ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అలాంటి చోట కొత్తగా మరొక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలైతే ఒకే ప్రదేశంలో రెండుకు మించి పోలింగ్ స్టేషన్లు ఉండకూడదని, పట్టణ ప్రాంతాల్లో 4 పీ.ఎస్‌లకు మించి ఒకే లొకేషన్‌లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరిశీలకులు అబ్దుల్ హమీద్ సూచించారు. ఓటరు జాబితాలో ఫోటో, చిరునామా సరిగా ఉందా లేదా అన్నది ఒకటికి రెండు పర్యాయాలు క్రాస్ చెక్ చేసుకోవాలని, ఒక కుటుంబానికి చెందిన ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు హక్కు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాలైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, కాంపౌండ్ వాల్ తదితర వసతులు సరిగా ఉన్నాయా లేదా అన్నది ముందుగానే పరిశీలించుకోవాలని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలని సూచించారు. బూతు లెవెల్ ఆఫీసర్స్, సూపర్వైజర్స్, ఎన్నికల విభాగానికి సంబంధించిన రిజిస్టర్లు సక్రమంగా మెయింటైన్ చేస్తూ షెడ్యూల్ ప్రకారం ఎన్నికల కమిషన్ సూచించిన విధంగా కార్యకలాపాలు నిర్వహించాలని, అన్ని రాజకీయ పార్టీలు ప్రతినిధులతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఎస్ఎస్ఆర్-2025 కార్యక్రమాల గురించి వివరించాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఓటరు జాబితా సవరణ, స్వీప్ ఆక్టివిటీస్, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు, తదితర వాటికి సంబంధించి చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలకులు అబ్దుల్ హమీద్‌కు వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి ఓటరు జాబితా సవరణ తీరును పరిశీలకులు హమీద్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, బీఎల్ఓలు, సూపర్వైజర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతి, కిరణ్మయి, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, సహాయ ఈఆర్ఓలు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల
సమస్యలను పరిష్కరించాలి

- చర్చలకు పిలిచేవరకూ పోరాటం
- స్పష్టం చేసిన సిబ్బంది
- ఇరు జిల్లాల్లో మద్దతు తెలిపిన సిఐటియు


కంఠేశ్వర్:నిరసనలో పాల్గొన్న ఆర్యో శ్రీ సిబ్బంది


కామారెడ్డి: నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

కంఠేశ్వర్ :ఆరోగ్య మిత్రాలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా చౌక్ వద్ద ఆరోగ్యశ్రీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సమ్మెను సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజీవ్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రాలు తమ వేతనాలు పెరగాలని ఆరు మాసాలుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆగస్ట్ ఆరవ తేదీన సమ్మె నోటీసు ఇచ్చారని, గత 45 రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అనివార్యమైన పరిస్థితుల్లో గురువారం హైదరాబాదులో ట్రస్ట్ బిల్డింగును వందలాది మంది ఆరోగ్యమిత్రాలు ముట్టడించారని తెలిపారు. ఆరోగ్య మిత్రల సమస్యలను పరిష్కరించకుండా వాయిదా వేయడంతోనే నిజామాబాద్ జిల్లాలో సమ్మె ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించకుంటే తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియూ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని నూర్జహాన్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామగౌడ్, శ్రావణ్, విజయ్, అంబికా, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : ఆరోగ్యశ్రీ ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా కామారెడ్డి జిల్లా ఆరోగ్యశ్రీ మిత్రలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ వారికి మద్దతు తెలిపింది. అందులో భాగంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆరోగ్య మిత్రాల చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతున్నామన్నారు. గత 16 సంవత్సరాల నుండి ఆరోగ్యశ్రీ ఉద్యోగాలు నిర్వహిస్తూ స్కిల్ ఎంప్లాయిస్ అయ్యుండి.. అన్ స్కిల్డ్ జీతం తీసుకోవడం బాధాకరమని తెలిపారు. ఉద్యోగులు సమ్మె నోటీస్ ఇచ్చి 45 రోజులు అయినప్పటికీ ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపలేకపోవడంతో శాంతియుత నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. వీరికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. వీరి ప్రధాన డిమాండ్ అయిన క్యాడర్ చేంజ్, జీవో 60 ప్రకారం జీతాలు తక్షణమే పెంచాలని, సమాన పనికి సమావన వేతనం చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆరోగ్యశాఖ మంత్రితో జరిగే చర్చలు ఆరోగ్యమిత్రాలకు న్యాయం జరిగే విధంగా ఉండాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆరోగ్య మిత్రాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దీన్, గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కారం విషయంలో కాలయపన చేస్తూ ఆరోగ్య మిత్రలను ఆందోళనకు గురిచేయడం విచారకరమని తెలిపారు. తక్షణమే క్యాడర్ చేంజ్, జీవో 60 ప్రకారం జీతాల పెంపు చేయాలని, సమాన పనికి సమాన వేతన చట్టం అమలు చేసి ఆరోగ్యమిత్రలకు అండగా ఉండాలని కోరారు. శుక్రవారం జరగబోయే చర్చలు మిత్రలకు అనుకూలంగా సఫలం కావాలని సమస్యలు పరిష్కరించని యెడల రాబోయే కాలంలో జరిగే ఆందోళన కార్యక్రమాలకు ప్రభుత్వం ఆజ్యం పోసినట్లు అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య మిత్రాలు కృష్ణవర్ధన్, మహేందర్, అంజయ్య, అనిల్, జయవర్ధన్, మహేష్, రాజు, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు రమణ

అవరోధాలు అధిగమిస్తేనే లక్ష్యాన్ని చేరుకుంటాం

- వైద్యులు రమణ

నవతెలంగాణ-రామారెడ్డి

ఇంటర్మీడియట్ దశలో అవరోధాలను అధిగమిస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని మానసిక వైద్యులు రమణ విద్యార్థులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. మొబైల్ ఫోన్లను సమాచారం కోసమే వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్, ప్రిన్సిపాల్ నారాయణ, ప్రసాద్, రమేష్, చైతన్య, రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుళ్లిన కూరగాయలతో
విద్యార్థులకు వంటలు

- జెడ్పీ సీఈవో చందర్ ఆగ్రహం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు చేస్తూ విద్యార్థులకు భోజనం పెట్టడం ఏంటని కామారెడ్డి జిల్లా సీఈవో చందర్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని బాలుర బాలికల బిసి వసతి గృహాలను జిల్లా సీఈవో చందర్, ఎంపీడీవో బషీరుద్దీన్ కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు కుళ్లిపోయిన కూరగాయలను చూసిన అధికారులు అవాక్కయ్యారు. 'ఏమిటి ఇది. కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు చేసి విద్యార్థులకు ఇలాగే భోజనం పెడుతున్నారా..?' అంటూ ప్రశ్నించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా కుళ్ళిపోయిన కూరగాయలతో వంట చేసి భోజనం పెట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఏదైనా జరిగితే బాధ్యులు ఎవరని ఆయన మండిపడ్డారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన, వసతిపై ఆరా తీశారు. వంటగదిలో కుళ్లిపోయిన కూరగాయలను చూసి వార్డెన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా భోజనంలో నాణ్యత కొరవడిందన్నారు. కుళ్లిన కూరగాయలతో వంటచేస్తుండడంపై నిర్వాహకులను అడిగితే ఏం చేసుకుంటారో చేసుకోండని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఈఓ చందర్ మాట్లాడుతూ.. మరోసారి ఇలాంటి పొరపాటు జరిగితే సహించేది లేదని, ఈ విషయం జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు.


కుళ్లిపోయిన కూరగాయలు


వంట గదిని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో


మాట్లాడుతున్న జిల్లా సెక్టోరియల్ అధికారి

విద్యార్థుల ఫేషియల్
అటెండెన్స్ తీసుకోవాలి

- జిల్లా సెక్టోరియల్ అధికారి వేణు శర్మ

నవతెలంగాణ-నిజాంసాగర్

విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ కచ్చితంగా తీసుకోవాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ సెక్టోరియల్ అధికారి వేణు శర్మ అన్నారు. గురువారం మండలంలోని అచ్చంపేట కాంప్లెక్స్ పరిధిలో గల మాగి ప్రాథమికోన్నత పాఠశాల, అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఉదయం 9:30లోపు విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఫేషియల్ అటెండెన్స్‌తో పాటు యుడైస్‌లో కూడా విద్యార్థుల నమోదు సరిపోయే విధంగా ఉండాలని సూచించారు. అనంతరం మండల నోడల్ అధికారి వై.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు. ప్రతిరోజు ఉపాధ్యాయులు ప్రార్థనకు 10 నిమిషాలు ముందు వచ్చి పాఠశాల అనంతరం 10 నిమిషాల తర్వాత పాఠశాలను వదిలి వెళ్లాలని ఆయన అన్నారు. ఎఫ్ఏ వన్‌కు చెందిన మార్కులను ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. డ్రాప్ బాక్స్‌లో ఉన్న విద్యార్థులను సంబంధిత పాఠశాలలో చేర్చుకొని డ్రాప్ బాక్స్‌ను క్లియర్ చేయాలని సూచించారు. అనంతరం జిల్లా సెక్టార్ల అధికారి అచ్చంపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బేస్ లైన్ టెస్ట్, న్యాస్ టెస్టులో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఐదవ తరగతికి చెందిన తెలుగు మోడల్ లెసన్‌ను తరగతి గదిలో పరిశీలించారు. పాఠ్యాంశాలకు అనుగుణంగా వర్క్ బుక్‌లో విద్యార్థుల చేత చేయిస్తున్నారా లేదా అనే విషయాన్ని పరిశీలించారు. వర్క్‌బుక్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దానిని పాఠ్యాంశాలకు అనుగుణంగా సాధన ఉపాధ్యాయులను సూచించారు. అకాడమిక్ సంబంధించిన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాగి, అచ్చంపేట పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- వ్యవసాయ సలహాదారుడు పోచారం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

ప్రతి మహిళ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రూపొందించిన పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో బాన్సువాడ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా పోషణ సంబురాలలో ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్ బాలికలకు హ్యాండ్ వాష్, ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులకు శ్రీమంతం చేశారు. పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని అందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. ప్రతి ఒక్కరూ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు ఎత్తు, బరువు కొలవడం, తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన కల్పించడం, టీకాలు వేయించడం చేస్తారని, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, శిశువు పుట్టినప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారని, పుట్టిన శిశువుకు ముర్రుపాలు పట్టించడం, ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇచ్చేలా అవగాహన కల్పించడం, ఆరు నెలల తర్వాత అదనపు ఆహారం, గర్భిణులు, బాలింతలు పోషకాల కోసం ఆకుకూరలు, తృణధాన్యాలు విధిగా తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నారని అన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఇసుక క్వారీలను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-బోధన్/పోతంగల్

బోధన్ మంజీరా పరివాహక ప్రాంతంలో ఇసుక క్వారీల ఏర్పాటుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా గురువారం బోధన్, సాలుర, పోతంగల్ మండలాల సరిహద్దుల్లో గల మంజీరా పరివాహక ప్రాంతాలలో ఇసుక క్వారీల కోసం జిల్లా భూగర్భ జల వనరుల శాఖ, రెవెన్యూ అధికారులు స్థలాల వివరాలను సేకరించారు. బోధన్ మండలంలోని సిద్దాపూర్, సాలురా మండలంలోని మందర్న, పోతంగల్ మండలంలోని కారేగం ప్రాంతాలలో ఇసుక క్వారీల నిర్వహణకు అధికారులు పరిశీలించారు.

పోతంగల్ : మండలంలోని సుంకిని, కారేగావ్ గ్రామాలలోని మంజీరా నదిని ప్రభుత్వ అధికారులు ఏ.డి. నిజామాబాద్ విజయ్ కుమార్ రాథోడ్, అసిస్టెంట్ ఏ.డి. నికత్ నాజ్, సాంకేతిక సహాయకుడు నగేష్, టి.జి. ఎం.డి.సి. శివతాజ్, ఆర్.ఐ తదితరులు పరిశీలించారు.


బోధన్ : రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నాలుగు నెలలుగా వేతనాలిస్తలే

- కుటుంబ ఎట్ల గడవాలి..?
- సెల్ టవర్ ఎక్కి పారిశుధ్య కార్మికుడి నిరసన

నవతెలంగాణ-బీబీపేట్

గత నాలుగు నెలలుగా గ్రామ పంచాయతీ అధికారులు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబం గడవలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని బీబీపేట్ మండలంలోని ఇస్సానగర్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడు కొమ్ము కనకరాజు సెల్‌టవర్ ఎక్కి గురువారం నిరసన వ్యక్తం చేశాడు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని తీవ్ర మనస్థాపానికి గురై సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలియజేశాడు. పంచాయితీ అధికారులు, గ్రామ పెద్దలు కలుగజేసుకొని సర్దిచెప్పడానికి ప్రయత్నించినా ససేమీరా వినకుండా.. అధికారులు తన పట్ల వ్యవహరిస్తున్న తీరును తెలియజేశాడు. దీంతో మండలంలోని పలు గ్రామాల పారిశుధ్య కార్మికులు ఇస్సానగర్ గ్రామపంచాయతీ పరిధిలోగల టవర్ వద్దకు చేరుకుని 25వ తేదీలోపు కార్మికునికి రావలసిన మొత్తాన్ని చెల్లించాల్సిందిగా అధికారులను కోరారు. దీనికి అధికారులు అంగీకరించడంతో పారిశుధ్య కార్మికుడు నిరసన విరమించి ఎప్పటిలాగే విధులకు హాజరయ్యాడు.


సెల్ టవర్ ఎక్కిన కార్మికుడు

ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేస్తాం : బోధన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నవీపేట్

ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని బినోల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన తాగునీరు, మూత్రశాలలు, నూతన గదుల నిర్మాణం తదితర మౌలిక వసతులను మెరుగుపరిచి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఉపాధ్యాయుల పట్ల తల్లిదండ్రులు గౌరవభావంతో మెలగాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో నాలేశ్వర్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సంజన త్రిశూలం పట్టి శివ తాండవం చేయగా సమాజంలోని చెడును చీల్చి చెండాడాలని నృత్యానికి మెచ్చి సంజనకు 5000 బహుమానంగా అందించారు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీఈవో దుర్గాప్రసాద్, ఎంపీడీవో నాగనాథ్, ఎంఈఓ గణేష్ రావు, ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంల తరలింపు

- పర్యవేక్షించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్‌లో గల ఈవీఎం గోడౌన్ నుంచి కట్టుదిట్టమైన భద్రత నడుమ సాంకేతిక లోపాలు తలెత్తిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీ.ఈ.ఎల్)కు గురువారం తరలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ల పర్యవేక్షణలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈవీఎంల తరలింపు జరిగింది. పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో 78 బ్యాలెట్ యూనిట్లు, రెండు కంట్రోల్ యూనిట్లను బీ.ఈ.ఎల్‌కు తరలించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా ఈ.సీ సూచనలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఈవీఎంలను తరలించారు. ఈ ప్రక్రియలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, తదితరులు పాల్గొన్నారు.

కులబహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న
- కామారెడ్డి ఎస్పీకి వినతి

నవతెలంగాణ-కామారెడ్డి

కులాంతర పెళ్లి చేసుకున్న దంపతులు అంత్యక్రియలకు హాజరైతే కుల సాంఘిక బహిష్కరణ చేసి కులం పేరుతో అవమానపరిచిన వ్యక్తులపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధుకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చిట్యాల సాయన్న మాట్లాడుతూ తాడ్వాయి గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ కులానికి చెందిన ఎరుకట్ల అక్షయ అదే గ్రామానికి చెందిన బీసీ కుర్మా కులానికి చెందిన బీర్ల అనిల్ గత ఐదు నెలల క్రితం ప్రేమించుకొని కులాంతర పెళ్లి చేసుకున్నారు. గత నెల అనిల్ మేనమామ బీర్ల రాజయ్య మృతి చెందగా.. అంత్యక్రియలకు వెళ్ళినందుకు 'మాదిగ కులానికి చెందిన అమ్మాయితో ఎప్పుడైతే పెళ్లి చేసుకున్నావో అప్పుడే నీవు కూడా మాదిగ కులానికి చెందిన వాడివి అయ్యావు. మీరిద్దరూ ఇక్కడ ఉంటే మేం అంత్యక్రియలు చేయం' అని చెప్పడంతో వెంటనే వారు అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారన్నారు. దీనిపైన తాడ్వాయి పోలీస్‌స్టేషన్లో ఎస్సైకి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడంలేదని, ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఎస్సై అవమానించి మాట్లాడుతున్నాడని తెలిపారు. ఈ విషయంలో జిల్లా ఎస్పీ స్పందించి బాధితులకు న్యాయం చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.భాగయ్య, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఇన్చార్జి నాగభూషణం, రజక సంఘం జిల్లా అధ్యక్షులు రాజన్న, ఉమ్మడి జిల్లా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లని శివ, అక్షయ, అనిల్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు గంగారెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా కేజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి పురస్కారం అందజేయాలని నిర్ణయించినట్లు ఏజీ ఆర్ ఫౌండేషన్ చైర్పర్సన్ విజయభారతి గురువారం తెలిపారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం రాష్ట్ర ఉత్తమ ప్రధనోపాధ్యాయులుగా ఎంపిక చేయబడ్డ ఆలూరు ప్రధానోపాధ్యాయులు మేసా నరేందర్‌ను ఎంపిక చేసి పురస్కారం అందించారు. కార్యక్రమంలో ఎజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు మోహన్‌రెడ్డి, బాబురావు విడిసి సభ్యులు, ఉపాధ్యాయ బృందం రాజేష్, రాంప్రభూ, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- ప్రజల్లో అవగాహన కోసమే స్వచ్ఛ సర్వేక్షన్ పక్షోత్సవాలు
- ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్ తెలిపారు. గురువారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షన్ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల్లో ఉన్న ప్రతి సభ్యురాలు తడి చెత్త, పొడి చెత్త వేరుగా జమ చేసి పంచాయతీ ద్వారా సేకరించే ట్రాక్టర్లకు అప్పగించాలని సూచించారు. ఈజీఎస్ ఏపీవో విద్యానంద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని, ఇంకా ఎవరికైనా అర్హత ఉండి మరుగుదొడ్లు లేని వారు ఉంటే తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమం లో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు, వివోఏలు, పంచాయతీ సిబ్బంది, ఈజీయస్ టిఏలు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణ, ఫైర్‌సేఫ్టీపై విద్యార్థులకు అగ్నిమాపక శాఖ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఏదైనా విపత్తు జరిగితే తల్లిదండ్రులు 101కు సమాచారం అందించాలని అగ్నిమాపక ఫైర్‌స్టేషన్ అధికారి బీ.శేఖర్ సూచించారు. ఫైర్‌సేఫ్టీపై అవగాహన కల్పిస్తూ ఏదైనా విపత్తు సమయంలో తమ సిబ్బంది ఎలా ముందుకు వెళ్తారో ఆయన వివరించారు. ఇంట్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగితే దానిని ఎలా ఆర్పాలో, సిలిండర్‌కి మంటలు చెలరేగితే ఎలా అదుపుచేయాలో ఫైర్ సిబ్బంది విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఫైర్ సిబ్బంది చేసిన ప్రయోగాలను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్, పాఠశాల పర్యవేక్షకులు టీ.రాజేందర్, అగ్నిమపాక సిబ్బంది రాములు, కే హనుమాన్ చారీ, కే.ఆశిష్, పీ.వినీత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత



చెక్కును అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌కుమార్ కృషితో మండల కేంద్రంలో పలువురికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన అరేపల్లి కృష్ణకి రూ.40 వేలు, జాక్క గంగానర్సుకి రూ.38 వేలు, ఎర్ల పెద్ద పోశెట్టికి రూ.16 వేలు, గాండ్ల చిన్నయ్య రూ.14 వేలు, చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాల్కొండ పట్టణ అధ్యక్షులు సంజీవ్‌గౌడ్, మైనారిటీ మండల అధ్యక్షులు జావిద్, బాల్కొండ పట్టణ ఇన్‌చార్జి జలాల్‌పూర్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో మార్చ్‌ఫాస్ట్ దుస్తుల వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మామిడిపల్లి యందు గురువారం విద్యార్థిని, విద్యార్థులకు సుధా సీడ్స్ లక్కారం పోశెట్టి, హెడ్మాస్టర్ దొంతుల రవీందర్, ఉపాధ్యాయులు సట్ల రాజేశ్వర్లు కలిపి రూ.15వేలు విలువగల మార్చ్‌ఫాస్ట్ దుస్తులను అందజేశారు. పట్టణంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో అర్బన్ లెవెల్ గేమ్స్ జరగనున్న నేపథ్యంలో అందజేసినట్టు హెడ్మాస్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోతే మోహన్, విటల్, శోభ, లింబాద్రి, భానుప్రకాష్, లావణ్య, రాజేశ్వర్, గంగా మోహన్, రేణుక, పిఈటి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి కార్మికుల నిరసన

- మూడు నెలలుగా అందని జీతాలు
- అధికారులను నిలదీసిన బీఆర్ఎస్ నాయకులు
- ప్రత్యేక అధికారిగా తన వల్ల కాదన్న ఎంపీడీవో
- స్పందించి రెండు నెలల వేతనం అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



అధికారితో మాట్లాడుతున్న కార్మికులు

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్మికులకు ప్రజాపాలనలో మూడు నెలల నుండి వేతనాలు అందడం లేదు. వేతనాలకోసం ప్రత్యేక అధికారిని, పంచాయతీ కార్యదర్శిని అడిగి అడిగి కార్మికులు విసిగిపోయారు. వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురైన గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు అధికారుల తీరకు నిరసనగా గురువారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలల వేతనాలు ఎప్పుడు ఇస్తారని పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్‌ను కార్మికులు నిలదీశారు. వేతనాలు ఇవ్వకపోతే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. వేతనాలు ఇవ్వనిదే విధులు నిర్వర్తించబోమని తెగేసి చెప్పారు. దీంతో అసహనానికి గురైన ప్రత్యేక అధికారి శ్రీనివాస్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తించడం తన వల్ల కాదని జిల్లా పంచాయతీ అధికారికి ఫోన్ ద్వారా విన్నవించినట్లు తెలిసింది. తనకు అనేకం పనులు ఉన్నాయని కార్మికులకు చెప్పి అక్కడినుండి తప్పించుకో చూశారు. తమ సమస్య పరిష్కరించేంత వరకు వెళ్లేదే లేదని కార్మికులు పేర్కొనడంతో ఎంపీడీవో అక్కడే ఉండి పోయారు. మూడు నెలలుగా గ్రామ పంచాయతీ సపాయి కార్మికులకు జీతాలు రావట్లేదని పంచాయతీ పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నారన్న సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు కొంటికంటి నరేందర్, సిపిఐ (ఎంఎల్) మండల కార్యదర్శి బషీర్ అశోక్, నాయకురాలు సత్తెమ్మ గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి పంచాయతీ కార్మికుల నిరసనకు తమ మద్దతు తెలియజేశారు. పంచాయతీ పారిశుధ్య కార్మికుల పక్షాన పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో చింత రాజా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్ లను నిలదీశారు. వేతనాలు అందించకపోతే కార్మికుల ఎలా జీవనం సాగిస్తారని అధికారులను ప్రశ్నించారు. తక్షణమే పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ, సిపిఐ (ఎంఎల్) నాయకులతో చర్చించిన అధికారులు వారి సూచనల మేరకు స్పందించి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు 2 నెలల వేతనాలు అందజేశారు. తమ వేతనాల సమస్యపై అధికారులతో చర్చించి వేతనాలు అందేలా కృషిచేసిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ టౌన్ అధ్యక్షులు కొంటికంటి నరేందర్, సిపిఐ (ఎంఎల్) మండల కార్యదర్శి బషీర్ అశోక్, నాయకురాలు సత్తెమ్మ లకు గ్రామ పంచాయితీ సపాయి కార్మికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎన్ఆర్ఐ పాలసీకోసం

గవర్నర్‌ను కలిసిన కోటపాటి బృందం

నవతెలంగాణ-ఆర్మూర్



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పలువురు

తెలంగాణ రాష్ట్ర గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలకోసం "ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో కోటపాటి నరసింహం నాయుడు నాయకత్వంలో గురువారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను రాజ్ భవన్ లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ నుండి లక్షల సంఖ్యలో 18 ఈసీఆర్ దేశాలు (ఆ దేశాలకు కార్మికులుగా వెళ్లాలంటే ఎమ్మిగ్రేషన్ తనిఖీ తప్పనిసరి). కాకుండా కాంబోడియా, రష్యా లాంటి దేశాలకు కూడా ఉపాధికై వెళ్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఏడు గల్ఫ్ దేశాలకు వెళ్లే వారికి వర్తించే విధంగా జీవో నెంబర్ 205, ఈనెల 16న విడుదల చేసిందన్నారు. దాని పరిధి విస్తరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాల్సిందిగా ప్రతినిధి బృందం గవర్నర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన గవర్నర్ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. కోటపాటి నరసింహనాయుడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు "సమగ్ర ఎన్నారై పాలసీ గల్ఫ్ కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయ్యాల్సి ఉందన్నారు. కానీ హడావిడిగా ఈనెల 16న కేవలం 7 గల్ఫ్ దేశాలకు వర్తించే విధంగా ఎవరైనా గల్ఫ్ దేశాలలో చనిపోతే 5 లక్షలు నష్టపరిహారం ఇవ్వడానికి నిర్ణయించారన్నారు. అది కూడా డిసెంబర్ 7 2023 నుండి ఇస్తామని ప్రకటించారని తెలిపారు.

యూఏఈ, బెహ్రేయిన్, ఖత్తర్, ఓమన్, కువైట్, సౌదీ, ఇరాక్ దేశాలలో మాత్రమే కార్మికులు మరణిస్తే నష్టపరిహారం ఇస్తారని అన్నారు. ఈ సి ఆర్ దేశాలకు వెళ్లిన కార్మికులకు కూడా వర్తింపజేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి జూన్ నెల 2014 నుండి చెల్లించాల్సిందిగా కోరారు. సమగ్ర పాలసీలతో కూడిన1000 కోట్ల బడ్జెట్ తో "గల్ఫ్ కార్మిక సంక్షేమ బోర్డు" వెంటనే ఏర్పాటు చేయాలని కోటపాటి బృందం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గల్ఫ్ జేఏసీ ఉపాధ్యక్షులు, కువైట్ తెలంగాణ సంఘం అధ్యక్షులు గంగుల మురళీధర్ రెడ్డి, జిల్లా గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు పట్వారి తిరుపతిరెడ్డి, కొక్కుల విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పండుగల నిర్వాహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- సీపీ కల్మేశ్వర్ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో ప్రజలు జరుపుకొన్నారని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ గురువారం కృతజ్ఞతలు తెలియజేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలో దాదాపు 6000 గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేశారని, గణేష్ ఉత్సవాలు జరుగుతున్న సమయంలోనే 16న మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకల సందర్భంగా నిజామాబాద్ కమిషనరేటు అంత 20 ప్రదేశాలలో ఉత్సవ వేడుకల ర్యాలీలు కూడా నిర్వహించారని తెలిపారు. దీనికి అన్ని మతాల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించుకొని జయప్రదం చేశారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-ముప్కాల్



బొల్లి సన్నీ (ఫైల్)

బుధవారం అర్ధరాత్రి 12:30 సమయంలో ముప్కాల్ జాతీయ రహదారి 44పై జరిగిన రోడ్డు ప్రమా దంలో ముగ్గురు యువకులు ప్రమాదానికి గురయ్యారు. అందులో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఎస్ఐ రజినీ కాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన బొల్లి సన్నీ, అన్వేపకా గోపి, చెన్నూరు అరవింద్ ముగ్గురు యువకులు రాత్రి సమయంలో ద్విచక్ర వాహ నంపై ముప్కాల్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించు కొని ఇంటికి వెళ్తున్నారు. లక్ష్మీ కెనాల్ బ్రిడ్జివద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది.

గాయపడ్డ యువకుడు తన స్నేహితునికి ఫోన్‌చేసి ప్రమాదం జరిగినట్టు సమాచారం అందించాడు. ఆయన వెంటనే 108కు సమాచారం ఇచ్చి ప్రమాదానికి గురైన ముగ్గురు యువకులను చికిత్స నిమిత్తం నిర్మల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వారిలో బొల్లి సన్నీ (19) చికిత్స పొందుతూ మృతి చెందరన్నారు. మరో ఇద్దరు యువకులు చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. సన్ని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నగర అభివృద్ధికి షబ్బీర్ అలీ ప్రత్యేక కృషి

- బిజెపి ఎమ్మెల్యే, అనుచరులు ఆరోపణలు మానుకోవాలి
- కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశ వేణు

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశ వేణు

నగర అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ప్రత్యేక కృషి చేశారని, బిజెపి ఎమ్మెల్యే ఆయన అనుచరులు చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశ వేణు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ నగర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తూ ఎప్పటికప్పుడు నగర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. నగరంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ఇంజనీర్ కళాశాలగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 10జిల్లాల్లో పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ ఇంజనీర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారన్నారు. అందులో నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాల ఒకటని ఆయన అన్నారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రయివేట్ వ్యక్తులకు అప్పజెప్పే కుట్రపన్నారని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక కలెక్టరేట్ ప్రాంగణంలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు.

ఇండోర్ స్టేడియంకోసం కూడా షబ్బీర్ అలీ ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే బొందెంచెరువు బాధితులకు పునరావాసం వారికి ఆర్థిక సాయం కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. భారీ వర్షం కారణంగా నాలాలోపడి చనిపోయిన బాలికకు ఆర్థిక సహాయం కింద ప్రభుత్వ సలహాదారులు ప్రభుత్వ పెద్దలతో చర్చించి బాలిక కుటుంబానికి 4లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఇవన్నీ ఏమీ తెలియని బిజెపి ఎమ్మెల్యే, ఆయన అనుచరులు షబ్బీర్ అలీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వీటన్నింటినీ వెంటనే మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే ప్రజలే వారికి తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిసిసి కార్యదర్శి నరాల రత్నాకర్, యూత్ కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీ రామర్తి గోపి, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షులు ప్రీతం, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, ఓబీసీ ప్రెసిడెంట్ నరేందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్, కేశ సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌కు స్థలం కేటాయించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నూతన కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌కు స్థలం కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌ను పి.సుధాకర్, పి.హనుమన్లు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలు నూతన కలెక్టరేట్ లోనే ఉన్నందు వల్ల పాత కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాలు సంబంధిత అధికారులకు ఇవ్వడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రస్తుతం ధర్నాలు నిర్వహిస్తున్న ధర్నాచౌక్ రోడ్డుపైనే ధర్నాలు నిర్వహించాల్సి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని విధంగా నిజామాబాద్ లో నూతన కలెక్టరేట్ వద్ద ధర్నాలు, నిరసనలు చేయకుండా ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదని తెలిపారు. ప్రజల,కార్మికుల అవసర నిమిత్తం కొత్త కలెక్టరేట్ సమీపంలో ధర్నా చౌక్‌కు స్థలం కేటాయించాలని కోరారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కళాశాలలు తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్యాధికారి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి

జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ గురువారం నిజామాబాద్ ప్రభుత్వ బాలుర ఖిల్లా జూనియర్ కళాశాల, మాక్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు, అధ్యాపకులతో సమావేశాలు నిర్వహించారు. ఆయా కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని, వెంటనే ప్రతి విద్యార్థి డేటాను పూర్తి స్థాయిలో కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. అలాగే ప్రతి విద్యార్థి పూర్తి సమాచారం యుడైస్‌లో కంప్యూటర్ల లో నిక్షిప్తం చేయాలని ఆదేశించారు. పేద, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల విద్యార్థులను తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు బోధన చేయాలని ఆదేశించారు. ప్రజ్ఞావంతులైన ఎంపీసీ, బిపిసి విద్యార్థులను గుర్తించి ఎంసెట్ కు సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి కళాశాలకు హాజరయ్యేలా చూడలన్నారు. ప్రతి విద్యార్థి వారి జ్ఞానాన్ని, స్థాయిని గుర్తించి వారికి అనుగుణంగా బోధన జరగాలని అన్నారు. కళాశాలల్లో మొక్కలను పెంచడం పై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కలాశాల కార్యాలయ సిబ్బంది ప్రతి విద్యార్థితో స్కాలర్షిప్ అప్లై చేయించి బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు వెంట వెంటనే ఫైల్ పంపించాలని ఆదేశించారు. బాలుర కళాశాల (ఖిల్లా) ప్రిన్సిపాల్ కాలిక్ పాషా, మక్లూర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం, ఐలపూర్ కళాశాల ప్రిన్సిపాల్ చిన్నయ్య, ఆయా కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కాసిం తండ్రి అనారోగ్యంతో మృతిచెందగా జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి గురువారం పరామ ర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కుమ్మరి శంకర్, రఘోత్తమరెడ్డి, సున్నపు మహేష్, బద్ది సతీష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నారెడ్డి మోహన్‌రెడ్డి

ఓటరు జాబితా పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్పేట్ గ్రామ పంచాయ తీని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. ఓటరు జాబితాను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోపాల్పేట్ గ్రామ పరిసరాలను పరిశు భ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కిష్టయ్యను ఆదేశించారు. మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలను సందర్శించి విద్యార్థులతో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రభాకర్ చారి ఉన్నారు.



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న డీపీవో

అభ్యంతరాలుంటే తెలపండి

- ఎంపీడీవోల సూచన
- ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఓటర్ లిస్టులో అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీవోలు సూచించారు. గురువారం ఉమ్మడి జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

నిజాంసాగర్ : గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటర్ లిస్ట్‌ను ప్రతి గ్రామపంచాయతీలో ఏర్పాటు చేశామని, ఓటర్ లిస్టులో ఏదైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21 వరకు పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయాలని ఎంపీడీవో గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని పార్టీల రాజకీయ నాయకులతో ఎమ్మార్వో బిక్షపతి, ఎంపీడీవో గంగాధర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికలకు 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు నూతన ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేపియాలని ఆయన అన్ని రాజకీయ పార్టీల నాయకులకు వారు సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి అనిత, బిఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు పట్లోళ్ల దుర్గారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, మల్లూరు సొసైటీ చైర్మన్ కళ్యాణి విఠల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఓటర్ జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎల్లారెడ్డి ఎంపీడీవో లక్ష్మి అన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : గ్రామీణ ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఇంచార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్ తెలిపారు. మండల సమీకృత సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన అన్ని పార్టీల నాయకులతో గ్రామపంచాయతీ వార్డ్ సభ్యుల ఓటర్ లిస్ట్ తయారీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేడు గ్రామాల్లో ఉన్న అన్ని పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేసి గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించినట్లు తెలిపారు. నూతన ఓటర్ నమోదు దరఖాస్తులను సెప్టెంబర్ 21 లోపు ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ 26లోపు అభ్యంతరాలను పరిష్కరించి, సెప్టెంబర్ 28న తుది ఓటర్ జాబితా విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండలంలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



నిజాంసాగర్ : మాట్లాడుతున్న ఎంపీడీవో



రెంజల్‌లో..

దోమకొండ : గ్రామ పంచాయతీ ఓటర్ ముసాయిదా ఓటర్ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21వ తేదీలోపు గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు సమర్పించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ముసాయిదా ఓటర్ జాబితాపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలోని ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే ఆయా పార్టీల నాయకులు ఆధ్వర్యంలో వాటిని గుర్తించి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులకు సమర్పించాలని జాబితాను నిశితంగా పరిశీలించి ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే అభ్యంతరం తెలిపి ఓటర్‌లకు ఇబ్బందులు లేకుండా తుది జాబితాలో ఉండేలా చూడాలని కోరారు. ఈనెల 21 తేది లోపు అభ్యంతరాలను సమర్పించాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంత్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మాజీ జడ్పిటిసి తిర్మల్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు కానుగంటి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రెంజల్ : రాష్ట్ర ప్రభుత్వం త్వరలో స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటర్ జాబితాలోని చేర్పులు మార్పులు తయారుచేసిన అనంతరం ప్రతి గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డులపై వాటిని అతికించినట్లు ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, మండల పాలన అధికారి శ్రీనివాసులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధులు, ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రఫీ హైమద్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు శేషు గారి భూమ్మ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు గోపికృష్ణ, సిపిఐఎంఎల్ మండల అధ్యక్షులు వడ్డెన్న, ఎంఐఎం పార్టీ మండల అధ్యక్షులు ఇంతియాజ్, బీఎస్పీ పార్టీ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : ఓటరు జాబితాలో తప్పులుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో నరేష్ తెలిపారు. మండలంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీడీవో, ఎంపీఓ మాట్లాడుతూ.. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు, అధికారులు, తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రభాకర్ చారి, తహసీల్దార్ శ్రీనివాసరావు వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన ఓటరు జాబితా సవరణలపై పలు అంశాలను వారితో చర్చించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వినోద్ ఉన్నారు.

ఎడపల్లి : ఓటర్ జాబితా సవరణపై నిర్లక్ష్యం వహించకూడదని ఎంపీడీవో శంకర్ తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతోపాటు బూత్ లెవెల్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రధాన పార్టీ రాజకీయ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా సవరించాలని ఎంపీడీఓ బాలగంగాధర్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా రూపొందించిన ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారినుంచి వచ్చిన అభిప్రాయాలను సేకరించి తీర్మానాలు చేశారు. ఓటర్ల జాబితాలో ఒక్కొక్క వార్డులో సరి సమానంగా ఉండేటట్లు ఓటర్లు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులుగా పిసిసి డెలిగేట్ గంగాశంకర్, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, టీఆర్ఎస్ సంజీవ్, గణేష్ పటేల్, బిజెపి ఎం.సాయి, బిఎస్పి బి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో..

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- స్వచ్ఛతాహిలో భాగంగా శ్రమదానం



శ్రమదానం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

దోమకొండ : మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవడం మనందరి బాధ్యత అని ఎంపిడివో ప్రవీణ్ కుమార్ తెలిపారు. స్వచ్ఛతాహి సేవ దినం శ్రమదానంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రతగా ఉంచాలని అధికారులకు సూచించారు. జూనియర్ కళాశాల భవనానికి అనుకొని ఉన్న చెట్ల కొమ్మలను పిచ్చి మొక్కలను తొలగించామని, కళాశాల ఆవరణలోని ప్లాస్టిక్‌ను ఏరివేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్, ఏపిఓ రజనీ, సీనియర్ అసిస్టెంట్ మానిక్ రావు, పంచాయతీ కార్యదర్శి రమేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, టిఏలు రాజేశ్వర్, లింగం కళాశాల లెక్చరర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా అవగాహన..

రెంజల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని సాటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తడి చెత్త పొడి చెత్తపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పాలన అధికారి హెచ్.శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ, ఉర్దూ మీడియా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాహిర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవకు అనూహ్య స్పందన..

నసురుల్లాబాద్ : స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తుందని నసురుల్లాబాద్ ఇంచార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్ తెలిపారు. గురువారం బాన్సువాడ మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించామని ఎంపిడిఓ బషీరొద్దీన్ తెలిపారు. బీర్కూర్ మండలంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని ఎంపీఓ మహేబూబ్ తెలిపారు. నసురుల్లాబాద్ మండలంలోని మీర్జాపూర్ నసురుల్లాబాద్, తదితర గ్రామాల్లో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణతోనే స్వచ్ఛ గ్రామాలుగా రూపుదిద్దుకుంటాయన్నారు. ప్రభుత్వం మహాత్మా గాంధీ నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మహాత్ముని జయంతి వేడుకల సందర్భంగా ప్రతి పంచాయతీల్లో స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మీర్జాపూర్ గ్రామ కార్యదర్శి పాల్య రవి, ఆరోగ్య కార్యకర్త గంగామణి, ఆశ కార్యకర్తలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను చూసి ఓర్వలేక పోతున్నారు..

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

దేశంలో రాహుల్‌గాంధీ ఎదుగుతున్న తీరును జీర్ణించుకోలేక బిజెపి పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీపై అనవసరమైన వ్యాఖ్యాలు చేస్తున్నారని నాగిరెడ్డిపేట కాగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాంధీ కుటుంబం టెర్రరిస్టుల గుండెలను ఎదురు పెట్టి ప్రజల కోసం ప్రాణాలు కోల్పోయిన గొప్ప కుటుంబమని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రజల కొరకు ప్రతిక్షణం పాటుపడే నాయకుడని ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి నాయకులకు గతాన్ని గుర్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. స్వతంత్రం నాటి నుండి కూడా ప్రజల కొరకు పాటుపడే గాంధీ కుటుంబం ప్రజల కొరకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన అన్నారు. బిజెపి నాయకులు రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం సాధించే విధంగా పనిచేయాలి..

రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని వెంకంపల్లి, తాండూర్, అక్కంపల్లి గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో ప్రజలను వివరించాలని ఆయన అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే విధంగా ముందుకు పోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దివిటీ కిష్టయ్య, మాజీ సర్పంచులు బాల్రెడ్డి, కృష్ణారెడ్డి, విట్టల్, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

నవతెలంగాణ-బీబీపేట్

మండలంలోని జనగామ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలను గురువారం నిర్వహించారు. విద్యార్థుల చూపు, వారి ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసి విద్యార్థుల కంటి చూపునకు తీసుకోవలసిన జాగ్రత్తలను వైద్యులు విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్ పటేల్ ఇతర వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి

టిపిసిసి అధ్యక్షుడిగా నియామకమైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను హైదరాబాదులోని గాంధీభవన్‌లో ఐఎన్‌టియుసి 325 రీజినల్ సమక్షంలో గురువారం ఘనంగా సన్మానించి బోకెను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ అధ్యక్షులు కనుక మేడల వేణుగోపాల్, కార్యదర్శి పూదరి గంగాధర్, ఎ.నాగరాజ్, నిజామాబాద్ అధ్యక్షులు కార్తీక్, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు సల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

మండలంలోని మద్దికుంట, స్కూల్ తాండాలో భారతీయ కిసాన్ సంఘ్ గ్రామ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మిడి లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా ఓరగంటి లింబాద్రి, కార్యవర్గ సభ్యులుగా చింత రాజిరెడ్డి, రేకులపల్లి ప్రసాద్ రెడ్డి, మైసి సురేష్, ఎం బాలరాజు, మోషన్‌పల్లి బాలయ్య, చెన్న నారాయణ, వడ్ల లింగమాచారిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆనందరావు, జిల్లా అధ్యక్షులు లొంక వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సాయిరెడ్డి, మండల అధ్యక్షులు కొడగండ్ల శేఖర్, బాలయ్య, డాక్టర్ శివయ్య తదితరులున్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-విలేకరుల బృందం

బాన్సువాడ (నసురుల్లాబాద్) : బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులను కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాన్సువాడ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన నేత మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్‌ను పోలీసులు గురువారం ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలో సీనియర్ నాయ కులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజాభవన్ ముట్టడికి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీ సులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో నర్సింలు గౌడ్, సాయిలు, చాకలి సాయిలు, తదితరులున్నారు.



కామారెడ్డి : అరెస్టు అయిన నాయకులు

రామారెడ్డి : రైతు సంఘాలు తలపెట్టిన ప్రజాభవన్ ముట్టడిలో భాగంగా బిఆర్ఎస్ నాయకులను గురువారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలు కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం రైతులకు బేషరతుగా రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతుబంధు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రతిపక్షాల సహకారంతో అడుగడుగునా ముట్టడి చేపడతామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో గురజాల నారాయణరెడ్డి, రంగు రవీందర్‌గౌడ్, పడగల శ్రీనివాస్, కాసర్ల రాజేందర్ ఉన్నారు.

బీబీపేట్ : తమకు ఎలాంటి ప్రమేయం లేకుండానే అక్రమ అరెస్టులకు తెరలేపుతున్నారని మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీబీపేట బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి దేవునిపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పసలాది బాలమని, మల్కాపూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు కక్కెర రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : గత అసెంబ్లీ ఎన్నికల్లో రైతులందరికి ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ వెంటనే అమలుచేసి వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు మాజీ శాసన సభ్యులు గంప గోవర్ధన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు యంకె.ముజీబొద్దీన్ ఆదేశాలతో గురువారం తెల్లవారుజామున 4:30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరిన పట్టణ బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పట్టణ పోలిస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో బిఆర్ఎస్ పార్టీ కామారెడ్డి పట్టణ అధ్యక్షులు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ పట్టణ అద్యకులు, మాజీ కౌన్సిలర్ మల్లన్నగారి భూంరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ, అన్నారం నరేష్‌రెడ్డి, తదితరులను అరెస్ట్ చేశారు.

గాంధారి : మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాంధారి మండల బిఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్‌రెడ్డి రాజులు, మాజీ మండల అధ్యక్షులు శివాజీ, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు జింగురు సురేష్, మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ ముస్తఫా, బిఆర్ఎస్ పార్టీ గాంధారి పట్టణ అధ్యక్షులు తూర్పు సంతోష్, జువ్వాడీ బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్యామ్, కార్యకర్తలు హైదరాబాద్‌కు వెళ్తున్న మార్గమధ్యలో నాయకులను అరెస్ట్ చేసి స్థానిక పోలిస్ స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికిన నాయకులు

నవతెలంగాణ-నిజాంసాగర్/మద్నూర్

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఈనెల 6న అమెరికా వెళ్లి పర్యటించి గురువారం ఉదయం జుక్కల్ నియోజక వర్గానికి చేరుకున్న సందర్భంగా మండలంలోని నర్సింగ్‌రావుపల్లి చౌరస్తా జాతీయ రహదారి వద్ద కాంగ్రెస్ ఉమ్మడి మండల అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా కార్యకర్తలతో కలిసి జుక్కల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు ఆయన బయలుదేరారు. కార్యక్రమంలో నాయకులు జయ ప్రదీప్, యూత్ అధ్యక్షులు మల్లయ్య గారి ఆకాష్, ప్రజాపండరి, ఉమ్మడి మండల కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ : ఎమ్మెల్యేకు సన్మానం

మద్నూర్ : వెనకబడ్డ జుక్కల్ నియోజకవర్గానికి మీ అమెరికా పర్యటనతో గుర్తింపు తీసుకువచ్చారని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పరమేష్ పటేల్ అన్నారు. జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అమెరికా పర్యటన ముగించుకొని గురువారం వచ్చిన సందర్భంగా ఆ యువ నాయకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానించి బోకేను అందజేశారు.

హనుమాన్ ఆలయ పునర్ నిర్మాణానికి రూ.4లక్షలు విరాళం హామీ



ఖాద్రి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని చిన్న గుడి హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది, జలమండలి సభ్యులు మమ్మద్ మోహినమ్మద్ ఖాద్రి కుటుంబ సభ్యులు రూ.4లక్షలు విరాళం అందజేస్తామని హామీనిచ్చారు. హిందూ సేన చిన్న గుడి లింగంపేట్ హనుమాన్ టెంపుల్ వినాయక ఉత్సవంలో భాగంగా తీసినటువంటి 150 మందిలో డ్రాలో మమ్మద్ మోహిన్‌అమద్ ఖాద్రికి వినాయకుని కానుకగా తులం బంగారం కానుక వచ్చింది. ఆలయ కమిటీ సభ్యులు గురువారం డ్రాలో వచ్చిన కానుకను తీసుకొని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాష్ట్ర జలమండలి సభ్యులు ఇంటికి వెళ్లారు. కానుకను దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పూలదండ వేసి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ పోతగోని శంకర్‌గౌడ్, ప్రకాష్, గోష్క రాజు, ప్రదీప్, జక్షాన్ని, రవికుమార్ గుప్తా, ప్రసాద్‌గౌడ్, మధు, ఆలయ కమిటీ సభ్యులున్నారు.

తక్కువ డబ్బులు చెల్లించి ఇంటికి పంపించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-మద్నూర్

కాంగ్రెస్ ప్రభుత్వం ఐసిడిఎస్ మంత్రి, అలాగే ఐసిడిఎస్ డైరెక్టర్ ఇచ్చిన హామీల ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్వాడి టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష, పెన్షన్, విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవోను తక్షణమే విడుదల చేయాలని, వరంగల్ జిల్లా ఆర్యా తండాలో మూడవ తరగతి ప్రారంభం తక్షణమే ఆపాలని, వేతనాల చెల్లింపు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) మంత్రి సీతక్కనును, ఐసిడిఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణను గురువారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ మేడం మాట్లాడుతూ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీవో తొందరలో ఇస్తామని తెలిపారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రాలను అందజేశారు. మంత్రి రిటైర్మెంట్ అంశంపైన స్పందిస్తూ తొందరలో కొత్త జీవో ఇస్తామని దీని ప్రకారం అందరికీ పెరిగిన డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన అంశాలపైన కూడా తొందర్లో పరిష్కారం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునిత, ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, కామారెడ్డి జిల్లా అంగన్వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సురేష్ గొండ, కోశాధికారి పి.మంగా, ఉపాధ్యక్షులు డి.సునీత, రాష్ట్ర నాయకులు బి.లలిత, బాబాయ్, కె.నర్సమ్మ, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మండల్ లెవెల్ గేమ్స్‌కు ఎమ్మెల్యేకు ఆహ్వానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 23న మండల కేంద్రంలో నిర్వహించే మండల లెవెల్ గేమ్స్‌కు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని విడిసి సభ్యులు, ఎంఈఓ, ప్రధాన ఉపాధ్యాయుడు గురువారం ఆహ్వానించారు. గ్రామానికి అభివృద్ధి పనులకు శంకుస్థాపన, డబుల్ రోడ్డు ప్రారంభోత్సవం, సెంట్రల్ లైటింగ్, మండల్ లెవల్ గేమ్స్‌కు ఈనెల 23న రావాలని కోరారు. మండలం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న పలువురు

అంగన్‌వాడీలో పోషణ అభియాన్

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-3లో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులకు వెయ్యి రోజుల గురించి వివరించారు. గర్భవతులు పౌష్టిక ఆహారం తీసుకోవాలని, పిల్లలకు తల్లి పాలను అందించాలని సూచించారు. హ్యాండ్‌వాష్ గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ మమత, అంగన్వాడీ టీచర్లు రజత, నసిమ, అంజిలి, భారతి, పిల్లలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.


పోషణ అభియాన్ నిర్వహిస్తున్న దృశ్యం

క్రీడా దుస్తులు వితరణ


క్రీడా దుస్తులతో విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కలిగోట్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కలిగోట్ ఎంప్లాయ్ అసోసియేషన్ క్రీడా దుస్తులను డొనేట్ చేయడం జరిగింది .ఈ క్రీడా దుస్తులను ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, సత్యనారాయణ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. వీరికి ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయ బృందం, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఆహార పొట్లాల పంపిణీ


కార్మికులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న చింత హనుమంతు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలం కేంద్రంలోని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు గ్రామానికి చెందిన చింత హనుమంతు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతూ వేతనాలు అడిగిన స్పందించని అధికారుల వైఖరితో విసుగు చెందిన పారిశుధ్య కార్మికులు పనులు బహిష్కరించి గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న చింత హనుమంతు కార్మికులకు ఒక పూట భోజన అందించాలని ఆహార పొట్లాలను అందజేశారు. పంచాయతీ కార్మికులకు వేతనాలు అందించేందుకు అధికారులు చొరవ చూపకపోయినా, తమ ఆకలి బాధను తీర్చిన చింత హనుమంతుకు పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, పద్మశాలి సంఘం సభ్యులు అంగరి రాజేశ్వర్, ఆడిచర్ల రాజు, చిలువేరి వినోద్, చింత గణేష్, వేముల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు గంగారెడ్డికి ఘన నివాళ్లు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ గంగారెడ్డి ద్వితీయ వర్ధంతి కార్యక్రమం ఆలూరులో గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, భారతి రెడ్డి, ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కెర విజయ్-మామిడిపల్లి, మాజీ సర్పంచ్ మారుతి రెడ్డి, కౌన్సిలర్లు లిక్కి శంకర్, శాల ప్రసాద్, ఆకుల రాము, మల్లారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.


నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జీవనభృతి 4016 అమలు కోసం పోరాడుదాం

- సిపిఐ (ఎంల్)మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ
- బీడీ కార్మికులతో ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-ధర్పల్లి

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాలతికి వినతిపత్రాన్ని అందించారు. ధర్నాలో సిపిఐ (ఎంల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ మాట్లాడుతూ.. ఇచ్చినహామీని అమలు చేయకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీడీ కార్మికులకు జీవనభృతిని 4016 పెంచి ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. 9 నెలలు గడుస్తున్న అమలు చేయలేదని తెలిపారు. బీడీ కార్ఖానాలు సరిగా నడవక వారు రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో బీడీ కార్మికులు కొట్టుమిట్టాడుతున్నా రన్నారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధిని చూపాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు. కార్మికులు ఐక్యంగా ఆందోళన చేపట్టి ప్రభుత్వం మెడలు వంచి పింఛన్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా సహాయ కార్యదర్శి పి.రమేష్, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) డివిజన్ నాయకులు ఆర్ . దామోదర్, మండల నాయకులు ఈ.రమేష్, ఎండీ.అనిస్, బి.కిశోర్, కె ఆశిస్, ఎస్.కిశోర్, ఓ.ఆశన్న, బీడీకార్మికులు లలిత, పద్మ లక్ష్మి, రాజు, గంగు, స్వేచ్ఛ, రాజు, నశ్రీన్ బేగం, సంజీదా, తస్లిమ్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అంజేస్తున్న సిపిఐ (ఎంల్)

ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే సవరిస్తాం


మాక్లూర్: రాజకీయ నాయకులతో సమావేశం


ఏర్గట్లలో..


ధర్పలిలో..

- ఎంపీడీవో క్రాంతి
- రాజకీయ నాయకులతో ముసాయిదా ఓటరు జాబితా పై సమీక్ష

నవతెలంగాణ-మాక్లూర్

ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ నాయకులతో ఎంపీడీఓ క్రాంతి ఆద్వర్యంలో ఓటరు జాబితాలో అభ్యంతరాలపై సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ఓటరు జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశామని తెలిపారు. అందులో ఏమైనా అభ్యంతరాలు, సవరణలు ఉంటే కార్యదర్శి దృష్టికి తీసుకువస్తే సవరణలు చేస్తామని సూచించారు. ఈ ఓటరు జాబితా అందురు రాజకీయ నాయకుల, ప్రజల సమక్షంలో ఉంచి, అందిరి సలహాలతో రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీఓ యూసుఫ్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా రానున్న ఎలక్షన్ల దృష్ట్యా ఓటరు జాబితా సవరణలో భాగంగా పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో ఎంపీవో యూసుఫ్ ఖాన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నట్ట భోజన్న, మండల బిజెపి అధ్యక్షుడు వేంపల్లి శ్రీనివాస్ గౌడ్, సిపిఐ ఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో గురువారం మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ రవీందర్ మాట్లాడుతూ.. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన వార్డుల వారిగా ఓటర్ లిస్టులో ఎలాంటి తప్పులు లేకుండా చుసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ భరత్ మిషన్ కార్యక్రమం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన ప్రజా పాలనా కార్యక్రమంలో బాగంగా మహా లక్ష్మి లబ్దిదారులకు పత్రాల పంపిణీపై ఎంపిడిఓ రవీందర్ పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో యం.పి.ఓ. శ్రీనివాస్ గౌడ్, ఉపాధి హామీ ఎపిఓ, మంజుల, అన్ని గ్రామాల పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ ముసాయిదా ఓటరు జాబితా పై వివిధ రాజకీయ పార్టీల నాయకులతోసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 13న మండలంలోని 14 గ్రామపంచాయతీలోని 138 వార్డుల వారిగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితా పై చర్చించారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉంటే ఈ నెల 21 వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 26 లోగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈనెల 28న తుది ఫోటో ఎలక్ట్రోల్ జాబితాను అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, మండల పరిషత్ కార్యాలయంలో ప్రచురిస్తామని తెలిపారు. తుది జాబితా తయారీలో ఆయా పార్టీల నాయకులు తమకు సహకరించాలని ఎంపీడీవో కోరారు. ఓటర్ జాబితా ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదానంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, కొత్తపల్లి రఘు, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కట్ట సంజీవ్ కుమార్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సారా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : మండలంలోని 22 గ్రామ పంచాయతీ పరిధిలోని, అన్ని వార్డుల వారీగా ఓటరు లిస్టు ప్రభుత్వం జారిచేసిన దశ్యా గురువారం మండల కేంద్రంలో ఎంపిడిఓ బాలకృష్ణ, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో, అలాగే అన్ని గ్రామాల గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అభ్యంతరాలు తెలపాలని కోరారు. అలాగే వారి వారి సూచనలు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, బీజేపీ నుండి లోలం గంగారెడ్డి, బిర్ఎస్ నుండి దారావత్ గోపాల్ నాయక్, డిఎస్పీ పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యదర్శులతో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సమావేశం నిర్వహించారు. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్, వార్డుల వారీగా తమ అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎంపీఓ శివ చరణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు దేవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్ రెడ్డి, గుండ విఠల్ పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో..


ఏర్గట్లలో..


డిచ్‌పల్లి మాట్లాడుతున్న అధికారులు

బీజేపీ హయాంలో మారని పేదల బతుకులు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీజేపీ హయాంలో మారని పేదల బతుకులు మారలేదని, పేదలు ఇంకా పేదలుగానే మిగులుతున్నారని సిపిఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు అన్నారు. 80 క్వార్టర్స్ శాఖ రెండవ మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట శాఖ కార్యదర్శి రేఖ జండా ఆవిష్కరించారు. ఈ మహాసభకు పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. ఈ పది సంవత్సరాల కాలంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత తినడానికి తిండి ఉండడానికి ఇల్లు లేక నిరుపేదలు నిరుపేదలు గానే మిగులుతున్నారని, ఉన్నోడు ఇంకా ఉన్నోడిగా పెరుగుతున్నారని అన్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేయడంతో పాటు నిరుపేదలకు ఉపయోగపడే పథకాలు ప్రైవేటీకరణ చేయడంతో పేదలు అనేక ఇబ్బందులకు పడుతున్నారని తెలిపారు. రామున్ని రాజకీయంలోకి లాగి ప్రజాసమస్యలను మరుగునపరుస్తున్నా రన్నారు. ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల్ని పట్టించుకొని ఉండడానికి ఇల్లు, తినడానికి తిండి, చేసుకోవడానికి చేతినిండా పని ఉండే విధంగా పథకాలను అమలు చేసి నిరుపేదలను ఆదుకోవాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత మాట్లాడుతూ.. సిసి రోడ్లు, వీధిలైట్లు, మురికి కాలువలు, మంచినీటి కలెక్షన్లు ఈశ్రం కార్డులో పింఛన్లు, స్థానికంగా ఉన్న సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం పనిచేసి సాధించుకున్న విజయాలు కూడా ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో నిరుపేదలకు అందవలసిన పథకాలు అందకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు రేఖా, సునీత, జ్యోతి, ఫిరంగి బాయి, జ్యోతి, సత్యశీల, సోనీ, శాలు బాయ్, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎం) నాయుకులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ లోని భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జమ్మిశెట్టి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణ కార్మికులకు వర్తించే ఇన్సూరెన్స్‌ను ఎల్ఐసికి అప్పజెప్పడం సరైన పద్ధతి కాదని అన్నారు. అనేక పోరాటాలు చేసి నిర్మాణ కార్మికులు కొన్ని హక్కులను సాధించుకుంటే వాటిని ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం వల్ల కార్మికులు నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు. అలాగే కొన్నివేల క్లైయిమ్స్ పెండింగ్లో ఉన్నాయని అన్నారు. వాటిని వెంటనే పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం.. బిల్డింగ్ నిర్మాణ కార్మికులందరికీ లక్ష స్కూటర్లను ఇవ్వాలని కోరారు ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు 10 లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, నార్మల్‌గా మరణించితే ఐదు లక్షలు ఇవ్వాలని తెలిపారు. వివాహ, ప్రసూతి, అంత్యక్రియల ఇచ్చే సహాయాన్ని లక్ష రూపాయలకు పెంచాలని కోరారు. నిర్మాణరంగ కార్మికుల పిల్లల చదువులకు స్కాలర్షిప్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని ఈ నెల 23న హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు పెద్ద ఎత్తున ధర్నా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని భవన నిర్మాణ రంగ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణ జిల్లా నాయకులు నల్వాల నరసయ్య, సలాం, సంపల్లి సతీష్, మోహన్ రావు, మురళి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శంకర్‌గౌడ్

ఎంఎడ్ పరీక్షల టైం టేబుల్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎంఎడ్ రెండవ, సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఈనెల 28 నుండి 03 అక్టోబర్ వరకు కొనసాగుతాయని తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిని ప్రొఫెసర్ డాక్టర్ఎం. అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్ సైట్ లో పొందుపరచడం జరిగిందని తెలిపారు.

నేడు ఆలూరు మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడోత్సవాలు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మిర్దాపల్లి లో నేడు 68వ ఎస్‌జిఎఫ్ ఆలూరు మండల స్థాయి అంతర పాఠశాలల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు కుంట శ్రీనివాస్ రెడ్డి గురువారం తెలిపారు.. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఈఓ దుర్గ ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఎంఈఓ, ఎస్‌జిఎఫ్, సెక్రటరీ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.

చీడ పీడలపై అవగాహన ఉండాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రతి రైతు తమ పంట పోలాల్లో వచ్చే చీడ పీడలపై అవగాహన కల్గి ఉండాలని నిజామాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. గురువారం ఇందల్ వాయి మండలంలోని గౌరారం గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారులు గతంలో చేసిన పంట నమోదును సిబిఈ యాప్ ద్వారా వెరిఫికేషన్‌ను క్షేత్రస్థాయిలో మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్ తో కలిసిపరిశీలించారు. వరి పంటలో వచ్చే చీడపీడల గురించీ రైతులకు అవగాహనా కల్పించారు. పంటలో ఏదైనా రోగాలు ఉన్న వ్యవసాయ అదికారులను కలిసి సమస్యలను వివరించి మందులను వాడాలని సూచించారు. వారి వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్, రైతులు ఉన్నారు.


మాట్లాడుతున్న వాజీద్ హుస్సేన్

పంట పొలాలు పరిశీలన

మోపాల్ : మండలంలోని తానాకుర్తి గ్రామంలో గురువారం వ్యవసాయ అధికారి సౌమ్య పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వరి పంటలో వివిధ రకాల రోగాలు, తెగుళ్ళు సోకడం గమనించామన్నారు. ప్రస్తుతం చూసుకున్నట్లతే వరిలో బ్యాక్టీరియా, ఎండాకు తెగులు, సుడి దోమ, ఆకు ముడత అగ్గి తెగులును గమనించామని తెలిపారు. వరి పంటలో ఈ సమయం లో కనిపించే బ్యాక్టీరియా, ఎండాకు తెగులును తొలిదశలో నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా ఆపివేయాలని, అలాగే కాపర్ హైడ్రాక్సైడ్ 400 గ్రాములు, స్ట్రెప్టమైసిన్ 60 గ్రాములు ఎకరానికి వాడితే ఈ తెగులు సోకకుండా నివారించవచ్చని అన్నారు. ఆమె వెంట ఏ ఈ ఓ రంజిత్, రైతులు పాల్గొన్నారు.


వరి పొలం పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-మెండోర

బుధవారం కాకతీయ కాలువలో గల్లంతైన ద్యారంగుల చిన్న మారెన్న మృతిచెందగా అంత్యక్రియలకు ఆర్థికసాయం గురువారం అందజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో కనీసం దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేకపోవడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కు విషయాన్ని తెలుపగా ఆయన 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందించారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
శుక్రవారం | సెప్టెంబర్ 20, 2024 | www.navatelangana.com

క్రొమిటోగ్రఫీ టెక్నిక్‌పై వర్క్‌షాప్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రసాయన శాస్త్ర విభాగం ధ్వర్యంలో క్రొమిటోగ్రఫీ టెక్నిక్ అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ వేణు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.సాయిలు విచ్చేసి విద్యార్థులకు పరిశోధన రంగంలో క్రొమిటోగ్రఫీ ఉపయోగాలు, వివిధ క్రొమిటోగ్రఫీ పద్ధతులను వివరించారు. వాటిని లాబరేటరీలలో ఉపయోగించే విధానాన్ని చేసి చూపించారు. కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ ఎం సునీత, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి. సాయిలు

బట్టాపూర్‌లో స్వచ్ఛతహి సేవ పక్షోత్సవాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

బట్టాపూర్ గ్రామపంచాయతీలో గురువారం స్వచ్ఛతహి సేవ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రవి మాట్లాడుతూ... మన ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అలాగే తడి చెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తూ.. వాటిని ఎలా వేరుచేయాలో తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి రవి

షరతులు లేకుండా రెండు లక్షలు రుణమాఫీ చేయాలి

- రైతు కార్యచరణ కమిటీ
- తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని తాసిల్దార్‌కు మండల రైతు కార్యాచరణ కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బిజెపి, సిపిఐ ఎంఎల్ పార్టీ రైతు నాయకులు పాల్గొన్నారు.

మాక్లూర్: రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రూ. రెండు లక్షల రుణమాఫి, రైతు భరోసా రూ. 15 వేలు యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని మండల రైతు కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫి ఏక కాలంలో చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని కోరారు. అనంతరం తహశీల్దార్ శేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల రైతు కార్యాచరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాక్లూర్: తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం


జక్రాన్‌పల్లి: తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

ఆర్మూర్: కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఏకకాలం లో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రెండు పంటలకు కలిపి రూ.15 వేలు రైతు భరోసా యుద్ధ ప్రతిపాదికన అమలుపరచాలని ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు బి,దేవారం, దేగం యదగౌడ్, శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీలతో పాటు ఏడవ గ్యారంటీ ప్రజాస్వామ్య పరిరక్షణ అని చెప్పిందని, ఎన్నికల్లో ప్రచారం చేయడమే కాకుండా ఎన్నికల ప్రణాళికలో సైతం పేర్కొందని తెలిపారు. అధికారం చేపట్టి 9 మాసాలు గడిచిపోతున్న రైతు భరోసా అమలుకు నోచలేదన్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తి అయినప్పటికీ ఏకాకాలంలో రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా చేయలేదని తెలిపారు. రెండు లక్షలపైన ఉన్న వారికి కూడా రుణమాఫీ చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ, గంగారం, యు.రాజన్న, అల్లూరి గంగారెడ్డి, నక్కల రాములు, సురేష్, విజయ్, అంకపూర్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ శోభాయాత్ర


డ్యాన్సులు చేస్తున్న చిన్నారులు

నవతెలంగాణం-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ శోభ యాత్రను గురువారం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గణేష్ శోభ యాత్రను ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామ శివారులో చెరువులలో గణేష్‌లను నిమజ్జనం చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రానికి చెందిన జాజు కోరు బుచ్చయ్య బుధవారం మృతిచెందగా.. బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకొని ఉదయం 5:30 బ్యాచ్ రూ.5000, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు అమ్ముల పశుపతి, పడిగెల శ్రీనివాస్, లక్ష్మాగౌడ్, మాజీ సర్పంచ్ దండ బోయిన సంజీవ్, మహిపాల్, గురజ కుంట స్వామి, జెసిబి శేఖర్, తూర్పు రాజు, తూర్పు సుబ్బన్న, గణేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీగా మల్లేష్ యాదవ్

- నవతెలంగాణ ఎఫెక్ట్
- స్పందించిన జిల్లా అధికారులు

నవతెలంగాణ-ముప్కాల్



ఈ నెల 16వ తేదీన ప్రచురించిన 'పంచాయితీ సెక్రటరీకోసం గ్రామస్తుల ఎదురుచూపులు' అనే శీర్షికకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ముప్కాల్ గ్రామపంచాయతీకి నూతన సెక్రటరీని నియమించారు. గురువారం పంచాయతీ సెక్రటరీగా డి.మల్లేష్ యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. దీంతో ముప్కాల్ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నవతెలంగాణ పత్రికకు కతజ్ఞతలు తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- సిపిఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్

నవతెలంగాణ- ఆర్మూర్

6 గ్యారంటీలను ఖచ్చితంగా అమలు చేయాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణంలో సిపిఎం కార్యాలయంలో గురువారం టీచర్స్ కాలనీ శాఖా మహాసభ సందర్భంగా శాఖ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య జెండా ఆవిష్కరణ చేశారు. సిపిఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరికీ మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వెంకటేస హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తవుతున్నప్పటికిని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని అన్నారు. ఆర్ గ్యారంటీలు ఇంకా అమలు జరగటం లేదని అన్నారు. గ్యాస్ సబ్సిడీ డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జామ కావటం లేదని అన్నారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ ఇంకా కాలేదని, మహిళలందరికీ 2500 ఇస్తానని ఇంకా ఇవ్వలేదని అన్నారు, ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల తో పాటు ఇంటి స్థలం కూడా చూపించాలని డిమాండ్ చేశారు హామీల అమలుకోసం ప్రజలందరినీ కదిలించి ఉద్యమానికి సిద్ధం చేస్తామని అన్నారు. నూతన శాఖ కార్యదర్శిగా కుతాడి ఎల్లయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శాఖ సభ్యులు సరస్వతి, రఫీ, రాజు, హసీనా బేగం, అమీర్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న సిపిఐ(ఎం) నాయకులు

పలు కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి గురువారంనిజామాబాద్ పట్టణ కేంద్రం లో గడ్డం మనోహర్ రెడ్డి (నాగేపూర్) కుటుంబ సభ్యులను, పట్టణ కేంద్రం లో సిప రాజశేఖర, లీడర్ శ్రీను, యమహా సునీల్ ,అనిల్ రమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన వన్నెల్ దేవి లావణ్య అయ్యప శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మారుతి రెడ్డి, కౌన్సిలర్ ఆకుల రాము ,శాల ప్రసాద్, లిక్కి శంకర్, ఆర్మూర్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జీవన్ నల్ల రవీందర్ రెడ్డి, బాస్ రమేష్ పాల్గొన్నారు.

క్షత్రియ పాఠశాలలో అర్బన్ స్థాయి క్రీడాపండగ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామశివారు క్షత్రియ పాఠశాలలో మండల అర్బన్ స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా క్షత్రియ విద్యా సంస్థల అధిపతి అల్జాపూర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్, ఎంఈఓలు మాట్లాడుతూ.. మాట్లాడుతూ.. డివిజన్‌లో విద్యాభివృద్ధికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్షత్రియ విద్యా సంస్థలు నాణ్యమైన విద్యను, భారతీయ సంస్కృతిని అందిస్తున్నాయని అన్నారు. క్రీడా పతాకాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడను ఎంచుకొని రాణించాలని సూచించారు. క్రీడలు మనకు ఒక లక్ష్యాన్ని చూపిస్తాయని, చదువులో రాణించడానికి క్రీడలు ఎంతోగానో తోడ్పడుతాయని అన్నారు. క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ మాట్లాడుతూ.. ఆర్మూర్ ప్రాంతం అక్షరక్రమం లోనే కాదు ఆటల పోటీలలో కూడా ఎంతో ముందందని తెలిపారు. ఇందుకు గతచరిత్ర ఒక మంచి ఉదాహరణ అని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వం ఏర్పడుతుందని, మానసిక వికాసం కలుగుతుందని అన్నారు. పోటీల్లో గెలుపోటములను సమానంగా తీసుకొని ఆశావహ దృక్పథంతో ముందుకెళ్లాలని శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ షేక్ మున్నా మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో, ఆటల్లో రాణించి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. మార్చ్ ఫాస్ట్ విజేతలకు బహుమతులను అందజేశారు. మూడు రోజుల పాటు జరిగే క్రీడోత్సవాల్లో క్రమశిక్షణతో ఆటలు ఆడాలని ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ నాగమణి సూచించారు. కార్యక్రమంలో అల్జాపూర్ లక్ష్మీనారాయణ , అల్జాపూర్ దేవేందర్, మండల విద్యాధికారి రాజగంగారం, కన్వీనర్ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గోపి రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యా సాగర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, కో ఆర్గనైజింగ్ సెక్రటరీ బ్రిజేష్, సాయిలు, సాయినాథ్ విద్యార్థులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్

నవతెలంగాణ-లింగంపేట్

రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ తమ సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్ తెలిపారు. గురువారం మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి మాలపాటి గ్రామాలలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేయాలని కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, మాజీ ఎంపీపీ ఆసియా మోహిద్, నాయకులు వంజరి ఎల్లమయ్య, నగేష్, అశోక్, కత్తుల అంజయ్య, సుభాష్, సాయికుమార్, అట్టెం శీను, రమేష్, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు కృషితో రోడ్డు అభివృద్ధికి మోక్షం

- కాంగ్రెస్ యువ నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం పదేళ్ల పాలన కాలంలో రోడ్డు అభివృద్ధిని పట్టించుకోలేక పోయిందని కాంగ్రెస్ యువ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు బాలు, యాదవ్, హనుమాన్లు, బండివార్ మాట్లాడుతూ.. మండల కేంద్రానికి వచ్చే రోడ్డును ఏమాత్రం పట్టించుకోలేకపోవడంతో ప్రయాణికులకు గుంతలమయం రోడ్డుతో ఇబ్బంది పడ్డారని తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే తోటాలక్ష్మి కాంతారావు ప్రత్యేకంగా చొరవ చూపుతూ నిధులు మంజూరు చేయిస్తూ రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనకు అభివృద్ధి పట్ల ప్రజల్లో ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని యువకులు పేర్కొన్నారు.


ప్రారంభమైన రోడ్డుపనులు

నాగన్నగారి మెట్ల బావి ప్రారంభానికి సిద్ధం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ముందుగా చారిత్రాక కట్టడమైన నాగన్నగారి మెట్లబావిని శుక్రవారం ప్రారంభించనున్నట్టు మండల అభివృద్ధి అధికారి నరేష్ తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్, ఇన్ఫోసిస్ సంస్థ ఫౌండర్ కల్పనా రమేష్‌ను ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట డిఆర్పీడీవో అధికారి వినోద్, ఎంపీడీవో నరేష్, ఎంపిఓ మలహరి, సూపరింటెండెంట్ పవన్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఉపాధి సిబ్బంది, తదితరులున్నారు. అలాగే ఈ బావిని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సందర్శించారు.

మొరం మట్టితో రోడ్డు గుంతలు పూడ్చివేత

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని గోజేగావ్ గ్రామానికి వెళ్లే రోడ్డును గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో అభివృద్ధి చేయలేకపోయింది. రోడ్డు అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయంలో పదేళ్ల కాలంగా జుక్కల్ ఎమ్మెల్యేగా కొనసాగిన హనుమంతు షిండే రోడ్డు అభివృద్ధి చేయలేకపోయారు. కానీ అసెంబ్లీ ఎన్నికల ముందర రోడ్డు అభివృద్ధి కోసం అలాగే వాగుపైన వంతెన నిర్మాణం కోసం కోట్లాది రూపాయలు మంజూరైనట్లు, శిలాఫలకాలు వేసి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం గోజేగావ్ రోడ్డు పరిస్థితి గుంతల మయంగా మారి అధ్వాన్న స్థితిలో ఉండటం పట్ల ఆ గ్రామ ప్రజలకు ఇబ్బందులు తలెత్తాయి. ఆ గ్రామ యువ నాయకులు సంతోష్‌పటేల్, దత్తు రాథోడ్ యువకులు ముందుకు వచ్చి గుంతలు పూడ్చివేత కోసం స్వచ్ఛందంగా 25 ట్రాక్టర్ల మొరం మట్టి వేయించారు. రహదారి మొరంమట్టితో గుంతలు పూడ్చి వేయించినందుకు ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చేయూత అందించిన స్నేహితులు

నవతెలంగాణ-మెండోర

మెండోర మండల కేంద్రానికి చెందిన గాండ్ల.అశోక్ ఇటీవల మృతి చెందటంతో తోటి మిత్రులు 2006 ఎస్ఎస్‌సీ బ్యాచ్ కు చెందిన వారు అశోక్ కుటుంబ సభ్యులకు 55వేల రూపాయిలు ఆర్థిక సహాయం అందజేశారు. సొంత ఇంటివారు పట్టించుకోని ఈ కాలంలో స్నేహితుని కుటుంబానికి అండగా ఆర్థిక సహాయం అందించి యువకులు ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ కొనియాడారు.

టిపిసిసి అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

నూతన టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని వారి నివాసంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మర్యాద పూర్వకంగా కలిసిన శాలువాతో ఘనంగా మర్యాద పూర్వకంగా సత్కరించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సాయిపటేల్, డోంగ్లి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు రాజు పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కానీ రైతుల వివరాల సేకరణ

- వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్

నవతెలంగాణ-లింగంపేట్

రుణమాఫీ కానీ రైతుల వివరాలు గ్రామాల వారిగా సేకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని బాయంపల్లి గ్రామంలో రుణమాఫీ కానీ కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తప్పకుండా రుణమాఫీ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలయ్య, పచ్చంటి సాయిలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత హి సేవ' పై అవగాహన

నవతెలంగాణ-ముప్కాల్/మోపాల్

ఈ నెల 17వ తేది నుండి వచ్చే నెల అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయా గ్రామాల్లో మహిళా సంఘం సభ్యులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఏపీఎం ప్రసాద్ రావు తెలిపారు. 'తడి-పొడి చెత్త' పై అవగాహనా కార్యక్రమం నిర్వహించామన్నారు. షెడ్యూల్ ప్రకారం తడి-పొడి, పరిసరాల పరిశుభ్రతలపై పంచాయతీ సెక్రటరీలకు అవగాహనా కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో, పంచాయతీ సెక్రటరీలు, ఐకేపీ సీసీ, వివోఏలు, మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు..

మోపాల్: ఐకెపి, డిఆర్డిఏ సంయుక్తంగా మండలంలోని గ్రామాల్లోని మహిళకు పచ్చదనం పరిశుభ్రత గురించి గురువారం అవగాహన కల్పించారని ఐకెపి ఎపిఎం మోహన్ తెలిపారు. పచ్చదనం పరిశుభ్రతను కూడా పాటించాలని అన్నారు. నర్సింగ్‌పల్లి గ్రామంలో మహిళలతో స్వచ్ఛతహి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సీసీ శ్రీదేవి మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కత్తిపోట్ల కలకలం

- గణేష్ నిమజ్జనంలో ఘటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజీవయ్య కాలనీలో గణేష్ నిమజ్జనం సందర్భంగా కత్తిపోట్ల కలకలం ఘటన చోటు చేసుకుంది. గణేష్ నిమజ్జనంను తిలకించడానికి వెళ్లిన అన్నదమ్ములపై అల్లరి మూక దాడి చేసింది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న మూడో టౌన్ పోలీసులు రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో ఒకరు కత్తిపోట్లకు గురయ్యారు.సంజీవయ్య కాలనీకి చెందిన అజేయ్, గణేష్ నిమజ్జన ఉత్సవాలను చూసి వస్తుండగా బుధవారం తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో స్థానిక యువకులు అటకాయించారు. తాగిన మైకంలో ఉన్న వారంతా అజయ్‌పై చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న ఆయన అన్న అర్వింద్ వచ్చి తమ్ముడిని ఎందుకు కొడుతున్నారంటూ అడ్డుకున్నారు. ఈ ఘర్షణలో వారు కత్తులతో దాడి చేయడంతో అర్వింద్ కత్తి పోట్లకు గురయ్యాడు. అతనిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలను తర్వాత వెల్లడిస్తామన్ని మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ గురువారం తెలియజేశారు.

ఆర్మీ జవాన్‌గా పూర్వ విద్యార్థి

- బుస్సాపూర్ పాఠశాలలో సన్మానం

నవతెలంగాణ-మెండోర

మండలంలోని బుస్సాపూర్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం ప్రార్థన సమయంలో పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి హరి కృష్ణ (దూదిగం) విద్యార్థి 2021లో ఆర్మీ జవాన్‌గా నియమితుడు కాగా గురువారం ఆయన పాఠశాలను సందర్శించారు. గతంలో ఫేర్వెల్ డే సందర్భంగా విద్యార్థుల ఇంటర్వ్యూలో భవిష్యత్తులో నీవు ఏమౌతావని అడిగినప్పుడు నేను జవాన్ అవుత సార్ అన్న జ్ఞాపకాలను అక్షరసత్యంగా చేసి నిరూపించుకున్నాడని అన్నారు. ఈసందర్భంగా ఆర్మీ జవాన్ హరికృష్ణను సన్మానించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్మీ జవాన్ హరికృష్ణ మాట్లాడుతూ గురువుల ఆశీస్సులతో ప్రస్తుతం తాను ఆర్మీ జవాన్‌గా అస్సాం పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. అక్కడి ఆర్మీ విశేషాలను ఉపాధ్యాయులు, విద్యార్థులతో పంచుకున్నాడు. ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ ఈ సన్మానం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉండలని కోరారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు జింధం నరహరి, చెవిటి భూపతి, అరుంధతి , రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.


పూర్వవిద్యార్థి, ఆర్మీజవాన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నూతన బోర్ ప్రారంభం

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని లింగాపూర్ 9వ వార్డులో నీటి సమస్య ఉందని కౌన్సిలర్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన చైర్‌పర్సన్ ఇందుప్రియా గురువారం బోరు వేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కొబ్బరి కాయ కొట్టి బోర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ పడిగే సుగుణ, పాత శివ కృష్ణమూర్తి, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహ్మద్ ప్రవక్త దినోత్సవం

- గ్రామంలో మైనార్టీల బైక్ ర్యాలీ

నవతెలంగాణ-లింగంపేట్

మమ్మద్ ప్రవక్త దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో మైనార్టీ సోదరులు ప్రధాన వీధుల గుండా బైకు ర్యాలీ నిర్వహించారు. గురువారం మమ్మద్ ప్రవక్త దినోత్సవ సందర్భంగా మిలాద్ ఉన నబీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జమ మసీద్, కొత్త బస్టాండ్ ప్రాంతంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మదర్స నిర్వాహకులు అబుల్ హసన్ రిజ్వీ మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవర్త ప్రపంచ శాంతిని కోరడం జరిగిందన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్లారెడ్డి సిఐ రవీందర్, లింగంపేట ఎస్సై అరుణ్‌కుమార్‌లు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం చిన్న పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DIST & SESSIONS JUDGE AT NIZAMABAD
G.W.O.P No. 10/2024

Between:-
Velma Srinivas S/o Velma Rajanna age 61 years Occ: Agri R/o H.No.2-19, vill. Gadkol, mdl. Sirikonda Dist Nizamabad. Pin. 503165. cell 97043 02352.
...petitioner
AND
1) Armoor Sravanthi w/o Late velmal Satish D/o Armoor Gangareddy age 28 years. Occ: Pvt. Employee R/o H.No.3-10. vill. Badgunna mdl: Nandipet. Dist.Nizamabad. Pin 503212. Respondant-1
2) To whomsoever it may concern
...Respondant-2

Where as the above matter is filed by the petitioner for the custody of his Grand Daughter namely kumari velma Samanvi D/o Late Velma Satish aged about 4 yrs, who is at present in the custody of Armoor Sravanthi (Respondent-1 herein mother)for the sake of the welfare of the Minor Child.

If any body has any claim or objection may appear before the Hon'ble Prl.Dist and Sessions Judge. Nizamabad on or before **15-10-2024.At 10.30 am.** in person or through Pleader failing which the matter will be decided in favour of the petitioner.

//BY THE ORDER OF THE COURT//
Date: 20.09.2024
Place: Nizamabad.
Raj kumar Bollaram
Advocate
Cell: 9494932909-9989642399
office: 5-6-727 opp:Dist.Court, Near: Vishwam Diagnostices, Nizamabad-503003